సంఘర్ జాతి హక్కుల సాధనకు పోరాటం



నర్సింహబస్తీలో పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన సంఘర్ జాతి విద్యార్థులను సత్కరించిన లక్ష్మణ్‌కుమార్ తదితరులు

నల్లకుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): సంఘర్ జాతి హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తున్నామని సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆదివారం నల్లకుంట డివిజన్ నర్సింహబస్తీ కమ్యూనిటీహాల్‌లో కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంఘర్ జాతి విద్యార్థులకు మెమోంటోలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘర్ కమిటీ అభివృద్ధి, సంక్షేమం కోసం కమిటీ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ చైర్మన్ కె.ప్రభురాజ్, సభ్యులు రాజేందర్, ఆర్.కిషన్, శ్రీకాంత్, యాదగిరి, అజయ్, రవి, సీహెచ్.తేజ తదితరులు పాల్గొన్నారు.

● ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవం



ఇజ్రాయేల్ స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఇజ్రాయెల్ అంబాసిడార్ హెచ్‌ఈ.రూవేన్ ఆజర్‌తో నల్లకుంటకు చెందిన ఎం.ఐజాక్‌రాజ్ తదితరులు

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

● హీరో సుధీర్‌బాబును కలిసిన అభిమానులు



హీరో సుధీర్‌బాబు జన్మదినం సందర్భంగా సూపర్ స్టార్ కృష్ణ మహేష్‌సేన అధ్యక్షుడు దిడ్డి రాంబాబు ఆయనను ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో యస్వంత్, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గోమాత శతకం ఆవిష్కరణ

చిక్కడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్ట్, హాస్యబ్రహ్మ డా.శంకరనారాయణ రచించిన 40వ శతక రచన గోమాత శతకం పుస్తకావిష్కరణ సభ ఆదివారం రాత్రి చిక్కడపల్లిలోని శ్రీకృష్ణమందిర్‌లో సాధన సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగింది. పుస్తకాన్ని గోమాత సేవాట్రస్ట్ ఛైర్మన్ లక్ష్మణరేఖ డా.ఎన్.గోపాలకృష్ణకు అంకితం ఇచ్చారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన తెలుగు యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు గోమాతశతక పద్యపోటీలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త డా.ఎస్.శ్రవణ్‌కుమార్, చింతలపాటి సురేష్, ఎర్రాప్రగడ మల్లికార్జునరావు, రాయరావు విశ్వేశ్వరరావు, సాధన నరసింహాచార్య తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ రికార్డ్ కోసం 25న అక్కాచెల్లెళ్ల కరాటే ప్రదర్శన

బర్కత్‌పుర, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న ఉదయం 10.30 గంటలకు జీవీఆర్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో అక్కా, చెల్లెలు వరల్డ్ రికార్డ్ కోసం కరాటే ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు అకాడమి డైరెక్టర్ డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కరాటే ప్రదర్శన వాల్‌పోస్టర్‌ను జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ ఆవిష్కరించినట్లు ఆయన తెలిపారు. జీవీఆర్ కరాటే అకాడమికి చెందిన అమృతారెడ్డి, గుణ సంతోషిణిరెడ్డి అక్కాచెల్లెలు. 11 చాప్టర్స్‌లో 121 సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌ను కేవలం 11 నిముషాలలో పూర్తి చేసి వరల్డ్ రికార్డ్ సాధించబోతున్నారని తెలిపారు.

పద్మశాలీ కాలనీలో ఘనంగా మాతృదినోత్సవం



వేడుకల్లో పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

ముషీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): మాతృదినోత్సవాన్ని పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పద్మశాలీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ మహిళా కమిటీ ప్రతినిధులు సుజాత, ఉమాదేవిల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేకును కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సుజాత, ఉమాదేవి మాట్లాడుతూ... సకల జగత్తుకు జీవనాధారం అమ్మ అని ప్రతి ఒక్కరూ తల్లిపై ప్రేమ చూపుతూ వారిని ఆదరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు స్వప్న, శ్రీవాణి, లావణ్య, దీప, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

కనిపించే దైవం మాతృమూర్తి



మాతృమూర్తులను సన్మానిస్తున్న కళా జనార్దనమూర్తి, నాగేశ్వరరావు

చిక్కడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): కనిపించే దైవం మాతృమూర్తి అని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అన్నారు. అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం త్యాగరాయ గానసభలో అమ్మలకు సత్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి పాల్గొని మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో తల్లి తర్వాతే తండ్రి, గురువు అని నేర్పిందన్నారు. హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ దివ్యాంగులైన పిల్లలను సైతం కంటికి రెప్పలా కాపాడుతూ పెంచే ఓర్పు తల్లికి ఉంటుందన్నారు. తల్లులకు చీరలు పంపిణీ చేశారు. రామ్‌చందర్, జంగిల్ శ్రీనివాస్, పవన్, ఉమ, సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్‌లో రాంనగర్ విద్యార్థికి 4,033 ర్యాంక్



ఏ.రూఫస్

ముషీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): రాంనగర్‌కు చెందిన ఏ.రూఫస్ ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో 4,033 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ఆయనను వారి తల్లిదండ్రులు ఎం.సాగర్, కాలేజీ ఉపాధ్యాయులు అభినందిస్తూ స్వీట్లు తినిపించారు. రూఫస్ మాట్లాడుతూ...సివిల్ ఇంజనీరింగ్ రంగంలో రాణిస్తూ భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో చదువుతున్నాను. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ ర్యాంకు సాధించానని తెలిపాడు.

జీహెచ్‌ఎంసీ వీఎస్టీ పార్కు

వాహ్..!



పార్కులో సందర్శకులు కూర్చోవడానికి ఏర్పాటు చేసిన బెంచీలు

● ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ ప్రత్యేకత ● నూతనంగా బటర్‌ఫ్లై, ఫ్యామిలీ సర్కిల్స్ చిత్రాల ఏర్పాటు ● రోజుకు 500లకుపైగా సందర్శకులు



పార్కులోని ఓపెన్ జిమ్‌లో ఆడుకుంటున్న చిన్నారులు



వాకింగ్ ట్రాక్

రాంనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని ఆజామాబాద్ వీఎస్టీ జంక్షన్ వద్ద దాదాపు ఎకరం స్థలంలో ఏర్పాటు చేసిన పార్కు ప్రజలకు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని అందిస్తోంది. దాదాపు రెండు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పార్కు ఇప్పుడు అన్ని హంగులతో సర్వాంగా ముస్తాబై సందర్శకులు, వాకర్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం మండే ఎండలో కూడా 100 శాతం పచ్చదనంతో కళకళలాడుతోంది. ఈ పార్కులో నిత్యం ఉదయం, సాయంత్రం సుమారు 500 మంది యువతీయువకులు, వృద్ధులు వాకింగ్ చేస్తున్నారు. ఓపెన్ జిమ్‌ను అన్ని విధాలుగా సందర్శకులు వినియోగించుకుంటున్నారు. పార్కుకు వచ్చే సందర్శకుల కోసం ఉడెన్ బెంచీలను ఏర్పాటు చేశారు. పార్కుకు రెండు వైపులా సందేశాత్మకమైన పెయింటింగ్ వేశారు. పార్కుకు మరోవైపు ఐరన్ జాలీలకు ఉన్న ప్రత్యేక ఆకర్షణతోకూడిన బొమ్మలు ఆనందం కలిగిస్తున్నాయి. పార్కులో ఆధునిక లైటింగ్‌సిస్టంతో రాత్రివేళ జిగేల్ మనిపించేలా తలపిస్తున్నాయి. నూతనంగా పార్కులో ఏర్పాటుచేసిన బటర్‌ఫ్లై, ఫ్యామిలీ బొమ్మలు ఆకట్టుకున్నాయి. వాటర్ మ్యూజికల్ ఫౌంటెన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ పార్కులో రోజు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకుతెరచి ఉంటుందని జీహెచ్‌ఎంసీ ఏఈ వినోద్, అర్బికల్చర్ అధికారి శ్యామలలు తెలిపారు.





పార్కులో ఏర్పాటు చేసిన వాటర్ మ్యూజికల్ ఫౌంటెయిన్

సాయిచేనేత కాటన్ అండ్ సిల్క్ ఎక్స్‌పోకు విశేష స్పందన

కవాడిగూడ, మే 11 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా హస్తకళలు, చేనేత కార్మికులు, డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువులు ఉత్పత్తులు నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఏప్రిల్ 21వ తేదీన ప్రారంభమైన శ్రీసాయిచేనేత కాటన్ అండ్‌సిల్క్ ఎక్స్‌పోకోకు నగర ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తుంది. హస్తకళాకారులు, చేనేత కళాకారులు తయారుచేసిన వస్తువులు ఎక్స్‌పో తక్కువ ధరలకే లభిస్తున్నాయి. దీంతో ఈ వస్తుల అమ్మకాలకు మంచిస్పందన వస్తుందని శ్రీసాయి చేనేత కాటన్ అండ్ సిల్క్ ఎక్స్‌పో కార్యదర్శి కంబంపాటి పద్మజ తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ రకాల కళాకారులు 100కుపైగా స్టాళ్లను ఏర్పాటు చేసి అన్ని రకాల వస్తువులను నగర ప్రజలకు తక్కువ ధరలకు అందించేందుకు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా పోచంపల్లి, మంగళగిరి, చీరాల సారీస్, డ్రెస్ మెటీరియల్స్, కలంకారి, ఉప్పాడ, నారాయణపేట, గద్వాల, గన్నవరం, కాశ్మీర్ సారీస్, డ్రెస్ కలకత్తా జామ్‌దాని వర్క్‌సారీస్, లుంగీలు, దోతీలు, కార్పెట్స్, దుప్పట్లు, వరంగల్ టవల్స్, బెడ్‌షీట్స్, దివాన్ సెట్స్, బ్యాంగిల్స్, బొమ్మలు, పెయింటింగ్‌లు ఎక్స్‌పోలో ఏర్పాటు చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రి సీతక్క ఎన్‌టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోను సందర్శించించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డ్వాక్రా మహిళలు, చేనేత కార్మికులు, హస్తకళాకారులు తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్ర టూరిజం ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి ఎక్స్‌పోను సందర్శించారని కంబంపాటి పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాలకు సంబంధించిన చేనేత వస్త్రాలు, పెయింటింగ్స్ ఎక్స్‌పోలు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. ఈ ఎక్స్‌పో ఏప్రిల్ 21 నుంచి మే 26వరకు కొనసాగుతుందని, ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎన్‌టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన శ్రీసాయిచేనేత కాటన్, అండ్‌సిల్క్ ఎక్స్‌పోలో ఉత్పత్తులను ఇటీవల పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, ఎక్స్‌పో కార్యదర్శి కంబంపాటి పద్మజ తదితరులు

'ప్రథమ స్థానంలో రాష్ట్రంలోని వినియోగదారుల సంఘాలు'

చిక్కడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో దేవాలయాల భూముల పరిరక్షణపై వినియోగదారుల్లో చైతన్యంతోపాటు న్యాయపోరాటం చేసి, భూముల పరిరక్షణలో మంచి ఫలితాలు సాధించడంలో తెలంగాణలోని వినియోగదారుల సంఘాలు ప్రథమ స్థానంలో ఉంటాయని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. ఆదివారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ గోల్కొండ చౌరస్తాలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మండలి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి, నిజామాబాద్, మహబూబాబాద్, నెక్కొండ, తొర్రూర్, భద్రాద్రికొత్తగూడెం, నాగర్‌కర్నూల్, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ జిల్లాల వినియోగదారులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు మరోసారి దేవాలయ భూముల పరిరక్షణకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల న్యూఢిల్లీలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో వినియోగదారుల సంఘాల ప్రతినిధులకు రెండురోజుల పాటు శిక్షణా తరగతులు జరిగాయన్నారు. తరగతుల అనంతరం కేంద్రప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల ముఖ్యకార్యదర్శి నిధిఖరేతో సమావేశం జరిగిందని, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు మూడంచెల న్యాయవ్యవస్థ అత్యంత క్రియాశీలకంగా పనిచేస్తున్నదని ఆమె వివరించారని పేర్కొన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలపై గ్రామస్థాయిల్లో సైతం చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని వినియోగదారుల సంఘాలకు ఆమె సూచన చేశారన్నారు. ఈ సమావేశంలో వినియోగదారుల మండలి సభ్యులు ఎ.శివపార్వతి, పల్లెపాడు దామోదర్, అనంతశర్మ, ప్రీతిపాండ్య తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న కోశిక శ్రీనివాసరావు తదితరులు

రాంనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం సభ్యత్వం నమోదు నిర్వహించి, బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు జరిపించాలి. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం ఒంటెత్తు పోకడలను మార్చుకోవాలి. తన ఏకపక్ష నిర్ణయాలను తీసుకోవడం మానుకోవాలి. 18 ఏళ్లకు సంబంధించిన సంఘం జమా ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలి' అని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోశిక శ్రీనివాసరావు, నేతలు దేవర శ్రీనివాసరావు, గొరియ మల్లేశం, మధిరకృష్ణ,పెంటప్ప, నర్సింహ, దొడ్డ శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కోశిక శ్రీనివాసరావు అధ్యక్షతన కురుమ సంఘం సభ్యత్వం, సంఘం ఎన్నికలు, అధ్యక్షుడు యెగ్గే మల్లేశం ఒంటెత్తు పోకడలపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అధ్యక్షుడిగా కొనసాగుతున్న యెగ్గే మల్లేశం సంఘం నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నారని ఆరోపించారు. సంఘాన్ని తన సొంత ఆస్తిగా వాడుకుంటూ రాజకీయంగా లబ్ధి పొందుతున్నారు తప్ప సంఘం అభివృద్ధికి కృషి చేయడం లేదన్నారు. ప్రశ్నించిన వారికి పదవులు ఇవ్వకుండా సంఘం నుంచి తొలగిస్తున్నారని వారు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా నూతన సభ్యత్వాన్ని చేపట్టి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంఘానికి సంబంధించిన ఆస్తులు, ఇతర వివరాలను వెంటనే తెలియజేయాలని వారన్నారు. తమ డిమాండ్లపై ఆయన స్పందించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంగోపాల్, వంశీకృష్ణ, భద్రీనాథ్, వంశీ, వీర్ల తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా యెగ్గే మల్లేశంపై చేసిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని సంఘానికి చెందిన నాయకులు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరుపక్షాలనాయకులు ప్రత్యారోపణలు చేశారు.

మల్లేశంపై తప్పుడు ఆరోపణలు తగవు

రాంనగర్: కురుమసంఘం అభివృద్ధి, కురుమల సంక్షేమం కోసం 20 సంవత్సరాలుగా నిస్వార్థంగా సేవచేసిన రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గే మల్లేశంపై సంఘం ఉపాధ్యక్షుడు కోశిక శ్రీనివాస్‌రావు, మరికొందరు నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం తగవని కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు కోరె రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విభేదాలు ఉంటే సంఘంలో కూర్చుని మాట్లాడాలని, బయట మాట్లాడొద్దని ఆయన హితవు పలికారు.

రవీంద్రభారతిని ప్రజాకళల హారతిగా మార్చాలి

భూపతి వెంకటేశ్వర్లు



రవీంద్రభారతిని ప్రజాకళల హారతిగా మార్చాలని కరపత్రం ఆవిష్కరిస్తున్న భూపతి వెంకటేశ్వర్లు తదితరులు

రాంనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రవీంద్రభారతిని ఆధిపత్యశక్తుల చెర నుంచి విముక్తి చేసి ప్రజాకళలకు పట్టంకట్టాలని తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం, తెలంగాణ జానపద జాక్ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ప్రజాకళల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రవీంద్రభారతి 1961 మే 11న నాటి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా ప్రారంభమై నేటికీ 64 వసంతాలు పూర్తయ్యిందన్నారు. నాడు రవీంద్రభారతి ప్రభుత్వ నేతృత్వంలో సాగేదని 1963లో స్వయం ప్రతిపత్తి హోదా కల్పించి, 1989 వరకు మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో నడిచిందన్నారు. 1989లో రాష్ట్ర భాషా సాంస్కృతి శాఖకు అప్పగించిన తర్వాత సాంప్రదాయ కళలకు శిష్ట కళాకారులకు మాత్రమే పెద్దపీట వేశారని ఆరోపించారు. నేడు రవీంద్రభారతి ఆధిపత్య హారతిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రవీంద్రభారతి కేంద్రంగా తెలంగాణ సమగ్ర సాంస్కృతిక విధానం లేకుండా కర్తవ్యాన్ని నిర్దేశించుకోకుండా కాలక్షేపం చేయడం కానే కాదు, 12 ఏళ్లగా తెలంగాణ కళాకారులకు ఏమైంది అంటూ కళాకారుల సమాలోచన అనే అంశంపై ఈ నెల 16న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దగా పడిన కళాకారులు దండోరాకు సిద్ధం కావాలంటూ రవీంద్రభారతి పరాయి భారతి కాకుండా కాపాడుకుందామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అయితగోని విజయ్‌కుమార్, జి.నరేష్, పొన్నం రాజయ్యగౌడ్, వినయ్, కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు నాయిని నర్సింహారెడ్డి జయంతి వేడుకలు

రాంనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హోంశాఖ తొలిమంత్రి, దివంగత నాయిని నర్సింహారెడ్డి జయంతి, సేవా కార్యక్రమాలు సోమవారం తెలంగాణ భవన్, ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్లు రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయిని జయంతి వేడుకలు జరుగుతాయని, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ నేతలు పాల్గొంటారని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలుచోట్ల సేవా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

'రాష్ట్రంలో టీడీపీకి పూర్వవైభవం రానున్నది'

రాంనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ తెలంగాణ రాష్ట్రంలో పూర్వవైభవం సంతరించుకోనున్నదని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఆదివారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని డివిజన్ల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశం మేరకు గ్రేటర్ హైదరాబాద్‌లో టీడీపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నియోజకవర్గాల మేరకు పార్టీ పరిశీలకులను నియమించామన్నారు. మాజీ కార్పొరేటర్ పి.బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి.శంకర్‌గౌడ్, డి.చంద్రమోహన్‌గౌడ్, ఎస్.ప్రకాష్, టీఎం.నాయుడు, వీరాజు, సాయికుమార్, ఉదయ్‌కుమార్, మంగ, సత్యనారాయణ, భానుప్రకాష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భారత సైనికులకు మద్దతు మనందరి బాధ్యత

చిక్కడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశ రక్షణ, సమగ్రత కోసం ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తున్న భారత సైనికులకు మద్దతుగా నిలబడడం మనందరి బాధ్యత అని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు ఇచ్చిన పిలుపుమేరకు సరిహద్దుల వద్ద పోరాడుతున్న సైనికుల విజయం, క్షేమం కాంక్షిస్తూ ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. బీజేపీ డివిజన్ నేతలు రత్నసాయిచంద్, దామోదర్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, సురేష్‌రాజు, ఆనంద్‌రావు, సత్యేందర్, రఘుయాదవ్, సాయి, తరుణ్, నీరజ్, శ్రీనివాస్, సంయుక్తరాణి తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌కు భారత్ బుద్ధి చెప్పాలి : కార్పొరేటర్

బర్కత్‌పుర, మే 11 (ఆంధ్రజ్యోతి): కాల్పుల విరమణకు తూట్లు పొడిచిన పాకిస్థాన్‌కు భారత్ సరైన బుద్ధి చెప్పాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. భారతీయ సైనికులకు మనోధైర్యం కలిగించడానికి ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా ప్రార్థనలు, పూజలు చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం వీరన్నగుట్ట శ్రీఆంజనేయస్వామి ఆలయంలో భారతీయ సైనికులకు ఆత్మస్థైర్యం, శక్తి కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు ఇవ్వాలి : బీఎంఎస్

చిక్కడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా కేంద్రప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని భారతీయ మజ్దూర్‌సంఘ్(బీఎంఎస్) తన అనుబంధ సంస్థలన్నింటినీ ఆదేశించిందని బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కేవీ.రాధాకృష్ణ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బీఎంఎస్ నగర కార్యాలయం శ్రమశక్తిభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గాం దాడి అనంతరం కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో భారత సైనికులు ఆపరేషన్ సిందూర్‌తో పాటు పాకిస్తాన్ కవ్వింపు చర్యలను సమర్థవంతంగా తిప్పికొట్టిందన్నారు. బీఎంఎస్ అనుబంధ సంఘాలు అన్ని కూడా దేశవ్యాప్తంగా సైన్యానికి మద్దతు ఇవ్వడానికి, కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో హిరేన్‌పాండ్యా, శంకర్, రవిశంకర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వృద్ధుడి మృతి

బర్కత్ పుర, మే 11 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ చెత్తను తరలించే లారీ ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కాచిగూడ ఎస్సై హెచ్.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక, భాగ్యనగర్‌కు చెందిన ఎస్.సిద్ధేశ్వర్(62) ఈనెల 6వ తేదీన చాదర్‌ఘాట్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో జీహెచ్‌ఎంసీ చెత్త లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో అతన్ని ఢీ కొట్టాడు. దీంతో సిద్ధేశ్వర్‌కు తీవ్రమైన గాయాలవడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు.